"నువ్వు?" అడిగాడు రెండోవాడిని.

"మా కుటుంబానికి తిండి గింజలు కొనడానికి." చెప్పాడు రెండోవాడు.

"విన్నావా? ఎవరు తనకోసం ఉంగరాన్ని అమ్ముకుంటున్నాడో అతని ఉంగరం బరువు కన్నా, ఇతరులకి దానం చేయడానికి అమ్మే ఉంగరం బరువు ఎక్కువ. కాబట్టి అతనికి ఎక్కువ ధర ఇవ్వు." చెప్పాడు గురువు.

## 136. విజయం-ఆనందం

ఓ తాత్విక గురువు ఓ రోజు తన శిష్యులని అడిగాడు.

"విజయానికి, ఆనందానికి గల తేడా ఏమిటి?"

అనేకమంది అనేక సమాధానాలు చెప్పారు కాని వాటిలో ఏదీ గురువు ఆశించిన విధంగా లేకపోవడంతో తనే సమాధానాన్ని చెప్పాడు.

"మీరు కోరుకున్నది మీరు పొందగలగడం విజయం. మీరు పొందిన దానితో మీరు తృప్తి పడగలగడం ఆనందం."

తర్వాత ఆయన మళ్ళీ ఇలా చెప్పాడు.

"మనం ఈ ప్రపంచంలో కోరుకున్నవాటి వెంటపడి మన సమయాన్ని అందుకు ఖర్చుచేసి వాటిని సాధించగలిగితే పొందే విజయం కన్నా, మనకి వచ్చిందాంతో తృప్తి పడుతూ మన సమయాన్ని భగవదారాధనకి వెచ్చించడం మంచిది. అందువల్ల మనం ఇక్కడే వదిలేసి వెళ్ళే ఇహ లోక సంపదలని కాక పరలోక సంపదని సమకూర్చుకోగలం. ఇహలోక సంపదని సంపాదించిన ఎవరూ దాన్ని పూర్తిగా అనుభవించకుండా ఇతరులకి వదిలివెళ్ళడమే అధికం. పరలోక సంపద మనం ఎక్కడున్నా మనకి నిజంగా ఉపయోగించే సంపద."

## 137. దేవుడున్నాడు

ఓ చక్కటి పార్క్‌లో వ్యాహ్యాళికి వచ్చిన ఓ పాప ఆకాశంలోకి కాసేపు ఏదో వెదుకుతున్నట్లుగా చూసింది. తర్వాత మెల్లిగా అడిగింది.